
సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
బుధవారం
25-06-2025
పేజీలు: 02



# రింకూ సింగ్ పెళ్లి వాయిదా

భారత క్రికెటర్ రింగూ సింగ్.. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్.. ఇటీవల నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఆ ఇద్దరి పెళ్లి నవంబర్ 19వ తేదీన జరగాల్సి ఉంది. కానీ ఆ పెళ్లి వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఇటీవల లక్నోలో చాలా గ్రాండ్‌గా ఎంగేజ్మెంట్ సెర్మనీ జరిగింది. ఆ వేడుకకు మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, నటి జయా బచ్చన్, భువనేశ్వర్ హాజరయ్యారు. ఓ హిందీ పత్రిక ప్రకారం.. నవంబర్‌లో క్రికెట్ షెడ్యూల్ బిజీగా ఉన్న కారణంగా.. రింకూ తన పెళ్లిని వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. ఇరువురికి చెందిన కుటుంబాలు ఆ వాయిదాకు అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రింకూ, సరోజ్ పెళ్లి జరిగే అవకాశాలు ఉన్నాయి. తుది తేదీని త్వరలో ప్రకటించనున్నారు. పెళ్లి కోసం వారణాసిలోని తాజ్ హోటల్‌ను తొలుత బుక్ చేసుకున్నారు. కానీ క్రికెట్ కమిట్‌మెంట్ వల్ల ఆ పెళ్లి వాయిదా వేసుకోవాల్సి వస్తోంది. ఆ హోటల్‌ను ఇప్పడ ఫిబ్రవరి చివరినాటికి బుక్ చేసుకున్నారు. జూన్ 8వ తేదీన ఇద్దరి మధ్య రింగ్ సెర్మనీ జరిగింది. టీ20 స్పెషలిస్టు రింకూ.. ఐపీఎల్‌లో కేకేఆర్‌కు ఆడుతాడు. ప్రియా సరోజ్ .. ఎస్పీ టికెట్‌పై మఛిలీషహర్ నుంచి గెలుపొందారు.

# రేపటి నుంచి గోల్కొండ కోటలో ఉత్సవాలు ప్రారంభం

ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే బోనాల ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం బోనాలను అధికారిక పండుగగా ప్రకటించినది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని అలయాల్లో ఉన్న అమ్మవార్లకు భక్తులు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. నెల రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లను చేసింది. గోల్కొంట కోటలో బోనాలు మొదట ప్రారంభించే సంప్రదాయం కులీకుతుబ్‌షా కాలం నుంచి వస్తుంది. అప్పట్లో కులీకుతుబ్‌షా నిర్వహించగా, నేడు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేస్తుంది. బోనాలు ఉత్సవాలకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని శ్రీజగదాంభిక ట్రస్టు బోర్డు ఏర్పాట్లు మొదలుపెట్టింది. గురువారం నుంచి జూలై 24వతేదీ వరకు తెలంగాణలో బోనాల జాతర జరుగనుంది. నెలరోజుల పాటు ఇక్కడ తొమ్మిది ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజలకు నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నారు. వీరికోసం గోల్కొండ కోటలోని అక్కన్న మాదన్న



కార్యాలయాలు, బాడిగార్డ్స్ లైన్స్ ప్రాంతాలు సిద్ధం చేస్తున్నారు. పూజల ప్రారంభోత్సవంలో భాగంగా మొదటి రోజు లంగర్‌హౌజ్ చౌరస్తా నుంచి అమ్మవారి తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తారు. చోటాబజార్‌లోని ఆలయం పూజారి ఇంటి నుంచి అమ్మవారి విగ్రహం, ఘట్టం ఊరేగింపు, బంజారాదర్వాజ నుంచి మొదటి బోనం ఊరేగింపు నిర్వహిస్తారు. ఇవన్నీ గోల్కొండ కోటపైకి చేరిన తర్వాత ఆలయం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, బోనం అమ్మవారిక సమర్పిస్తారు. కోటలో బోనాల జాతర జరుగనుండడడంతో గోల్కొండ కోట పాలన చూస్తున్న కేంద్ర పురావస్తు శాఖ పలు మార్పలు చేయనుంది. బోనాలు జరిగే ఆదివారం, గురువారం రోజుల్లో ఉచిత ప్రవేశం కల్పించారు. కోటలో ప్రతీ రోజు రాష్ట్ర పర్యాటక సంస్థ రెండు లైట్ అండ్ సౌండ్ షోలు నిర్వహిస్తుంది. ఆదివారం, గురువారాలు మొదటి షోను రద్దు చేస్తారు. రెండవ షో 8 గంటల నుంచి యధావిధిగా ఉంటుంది.

## బోనాల షెడ్యూల్ ఇదీ..

| |
|---|
| జూన్ 26న మొదటి పూజ |
| జూన్ 29న రెండవ పూజ |
| జూలై 3న మూడవ పూజ |
| జూలై 6న నాల్గవ పూజ |
| జూలై 10న ఐదవ పూజ |
| జూలై 13న ఆరవపూజ |
| జూలై 17న ఏడవ పూజ |
| జూలై 20న ఎనిమిదవ పూజ |
| జూలై24న తొమ్మిదవ పూజ |

# ఎమర్జెన్సీ రోజుల్ని ఏ భారతీయుడూ మరిచిపోలేరు


## ప్రధాని మోదీ

దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు పూర్తి అయ్యాయి. 1975 నుంచి 1977 వరకు ఆ నాటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ అమలు చేశారు. ఈ నేపథ్యంలో ఇవాళ ప్రధాని మోదీ స్పందించారు. తన ఎక్స్ అకౌంట్‌లో ఆయన రియాక్ట్ అయ్యారు. ఎమర్జెన్సీ సమయంలో ఎలా రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘించారో ఏ ఒక్క భారతీయుడు కూడా మరిచిపోలేరని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ సూత్రాలను బలోపేతం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో ఎమర్జెన్సీ ఓ చీకట అధ్యాయం అని ఆయన వెల్లడించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను ఆ సమయంలో పట్టించుకోలేదని విమర్శించారు. ప్రాథమిక హక్కుల్ని సస్పెండ్ చేశారన్నారు. పత్రికా స్వేచ్ఛ నాశనమైందన్నారు. ఎమర్జెన్సీ సమయంలో భారీ సంఖ్యలో రాజకీయ నేతల్ని, సామాజిక కార్యకర్తలను, విద్యార్థులను, సాధారణ పౌరుల్ని కూడా జైలులో వేసినట్లు ఆయన గుర్తు చేశారు. ఆ నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అరెస్టు చేసిందన్నారు. ఎమర్జెన్సీ రోజుల్ని సంవిదాన్ హత్య దివస్‌గా జరుపుకోనున్నట్లు చెప్పారు.



# అఖిల్ సినిమా నుంచి శ్రీలీల అవుట్!

టాలీవుడ్ యువ హీరో అక్కినేని వారసుడు అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. ఈ సినిమాకు మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తుండగా, అఖిల్ సొంత నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే నుంచి టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేయగా.. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ గ్లింప్స్ ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ సినిమాలో కథనాయికగా నటిస్తున్న శ్రీలీల మువీ నుంచి తప్పకుందని తెలుస్తుంది. మొదట ఈ సినిమాలో హీరోయిన్‌గా శ్రీలీల ఖరారైనట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే, ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న ఇతర ప్రాజెక్టులు, ముఖ్యంగా హిందీ, తమిళ సినిమాల కోసం డేట్స్ కేటాయించడం కష్టంగా మారిన కారణంగా ఈ ప్రాజెక్ట్ నుంచి శ్రీలీల తప్పకోవాలని




నిర్ణయించుకున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు ఈ వార్తలు నిజమైతే, శ్రీలీల స్థానంలో మరో హీరోయిన్‌ను వెతికే పనిలో చిత్రబృందం ఉందని తెలుస్తోంది. శ్రీలీల ప్రస్తుతం తెలుగులో పవన్ కల్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో పాటు బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్‌తో ఒక చిత్రంలో తమిళంలో సుధ కొంగరా చిత్రంలో నటిస్తుంది.




# మంత్రుల పని తీరుపై సిఎం రేవంత్ సీరియస్

కొందరు మంత్రుల పని తీరు బాగా లేదు- - -జిల్లాల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీకి జాబితాలు సిద్ధం చేయడంలో జాప్యం చేస్తున్నారు. నిధులు, విధులు, బాధ్యతలు మీ వద్దే ఉన్నా నిర్లక్ష్యం ఎందుకూ ? అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఏఐసిసి నాయకురాలు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ సమక్షంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన మంగళవారం పార్టీ రాజకీయ వ్యవహారాల సలహా సంఘం (పిఏసి) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ కొంత మంది మంత్రుల పని తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారని తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ సీట్లను కైవసం చేసుకోవడానికి మంత్రులే బాధ్యత తీసుకోవాలని ఆయన అన్నారు. గ్రామాల్లో పర్యటన చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు. పార్టీ-ప్రభుత్వం జోడెద్దుల్లా పని చేయాలని ఆయన అన్నారు. ఎప్పడు ఎన్నికలు వచ్చినా ఎదుర్కొవడానికి పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. అయితే కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు కాబట్టి వారికీ సరైన గుర్తింపునివ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు స్థానికంగా అంటే జిల్లాల్లో వివిధ నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో జిల్లా మంత్రులు, ఇన్‌ఛార్జీ మంత్రులు చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ ప్రక్రియ ఎందుకు జరగడం లేదోనని ఆయన ఒకింత అసహనం వ్యక్తం చేశారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. పార్టీకి గ్రామ , మండల స్థాయి కమిటీల ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన మంత్రులకు సూచించారు.

# 10 రోజులుగా భారత్‌లోనే బ్రిటన్ ఫైటర్ జెట్!



ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన యుద్ధ విమానాలలో ఒకటైన బ్రిటన్ దేశానికి చెందిన ఎఫ్-35 బీ (F-35B) ఇంకా కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టులోనే ఉంది. సాంకేతిక సమస్య కారణంగా ల్యాండ్ అయిన ఈ జెట్ గత 10 రోజులుగా భారత్‌లోనే నిలిచిపోయింది. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఈ బ్రిటిష్ జెట్‌కు సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది నిరంతరం భద్రత కల్పిస్తున్నారు. అయితే ఆ జెట్‌లో సమస్య ఏంటి..? ఇన్ని రోజులు ఎందుకు చిక్కుకుపోయిందన్న విషయంపై మాత్రం ఇప్పటికీ క్లారిటీ లేదు. గత పది రోజులుగా తిరువనంతపురం ఎయిర్‌పోర్ట్ ఆరుబయటే ఈ జెట్‌ను పార్క్ చేశారు. దీంతో దాన్ని హ్యాంగర్‌కు తరలించమని భారత్ చేసిన విజ్ఞప్తిని బ్రిటన్ నేవీ సున్నితంగా తిరస్కరించింది. ఈ ఫైటర్ జెట్ సాంకేతికత గురించి ఆందోళన కారణంగా వారు ఈ ఆఫర్‌ను తిరస్కరించినట్లుగా తెలిసింది. తుది తనిఖీల సమయంలో మాత్రం దీన్ని హ్యాంగర్‌కు తరలించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంటోంది.



# హాట్‌గా కవ్విస్తూ..

ఎంతో మంది ముద్దుగుమ్మలు కోటి ఆశలతో ఇండస్ట్రీలోకి అడుగుపెడతారు. అవకాశాల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతూ ఎన్నో ఆడిషన్స్ ఇచ్చి సినిమాల్లో ఛాన్స్ లు అందుకుంటూ ఉంటారు. అలాగే కొంతమంది షార్ట్ ఫిలిమ్స్ తో మెప్పించి ఆతర్వాత హీరోయిన్స్ గా అవకాశాలు అందుకున్నారు. అలాంటి వారిలో ఈ బ్యూటీ ఒకరు. పై ఫొటోలో ఉన్న బబ్లీ గర్ల్ ను గుర్తుపట్టారా.? ఎంత ముద్దుగా ఉందో కదా.. ఆమె ఇప్పుడు టాలీవుడ్ లో తోపు హీరోయిన్ ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. అలాగే తొలి సినిమానే స్టార్ హీరో పక్కన ఛాన్స్ అందుకుంది. ఇంతకూ ఆమె ఎవరో గుర్తుపట్టారా.? ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ బ్యూటీగా పేరు తెచ్చుకుంది ఆ చిన్నది. ఇంతకూ ఆమె ఎవరంటే.. షార్ట్ ఫిలిమ్స్ నుంచి వచ్చిన హీరోలు, హీరోయిన్స్ తమ టాలెంట్ తో ప్రేక్షకులను మెప్పిస్తున్నారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# గదిలోకి కత్తితో వెళ్లిన నవ వధువు.. కంగుతిన్న వరుడు

ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఒక భర్తను దారుణంగా హత్య చేసి సిమెంట్ డ్రమ్‌లో కప్పెంటింది భార్య. ఈ ఘటన మరువక ముందే హనీమూన్ పేరుతో మేఘాలయాలో భర్తను చంపిందీ ఇండోర్‌కు చెందిన మరో యువతి. ఈ ఘటన నుంచి తెరుకోకముందే.. ఏపీలో తేజేశ్వర్‌ను ప్రియుడితో కలిసి భార్య దారుణంగా హత్య చేయించింది. వరుసగా జరుగుతోన్న ఈ తరహా ఘటనలతో దేశంలోని ప్రజలు ఉలిక్కి పడుతున్నారు. అలాంటి వేళ ఒక కొత్త వధువు.. తొలి రాత్రి గదిలోకి పాల గాస్లుతో కాకుండా కత్తిని తీసుకు వెళ్లి భర్తను చంపేస్తానంటూ బెదిరించింది.ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్‌లో చోటు చేసుకుంది. నిషాద్ అనే వ్యక్తికి ఇటీవల సితార అనే యువతితో వివాహమైంది. వివాహ సమయంలో సంతోషంగా వ్యవహరించిన ఆమె.. తొలి రాత్రి మాత్రం చాలా వింతగా ప్రవర్తించింది. గదిలోకి కత్తిని తీసుకొచ్చి.. నన్ను తాకితే 35 ముక్కలు చేస్తానంటూ అతడిని బెదిరించింది. తనకు ఈ వివాహం ఇష్టం లేదని తాళికట్టిన భర్తకు స్పష్టం చేసింది. అమన్ అనే వ్యక్తిని తాను ప్రేమిస్తున్నట్లు తెలిపింది. ఈ విషయం బహిర్గతం చేస్తే.. నీతోపాటు మీ కుటుంబ సభ్యులపై తప్పుడు కేసు పెడతానంటూ బెదిరించింది. ఈ విషయాన్ని నిషాద్.. తన కుటుంబ సభ్యులకు వివరించాడు. దీంతో ఆ మురునాడే పెద్దల ఎదుట పంచాయతీ పెట్టారు. ఆ క్రమంలో సితారకు ఆమె కుటుంబ సభ్యులు నచ్చ చెప్పారు. అనంతరం ఆమెను నిషాద్ ఇంటికి తీసుకువెళ్లాడు. అయినప్పటికీ అక్కడ ఆమె వేధింపులు మాత్రం ఆగలేదు. దీంతో వరుడు కుటుంబం విసిగిపోయి.. పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు సితార తన ప్రియుడు అమన్‌తో కలిసి ఇంట్లో నుంచి పారిపోయింది. ఆమె కోసం పోలీసులు



గాలిస్తున్నారు. సితారకు అమన్ వరుసకు మేనల్లుడు అవతాడని పోలీసులు వివరించారు. సితార ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# పంచాయత్ సీజన్ 4 రివ్యూ

హిందీలో బాగా పాపులర్ అయిన వెబ్ సిరీస్ పంచాయత్, ఇప్పుడు నాలుగో సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో హిందీలో మాత్రమే స్ట్రీమింగ్ అవుతున్న ఈ వెబ్ సిరీస్ ప్రేక్షకులను ఎంతమేర ఆకట్టుకుందో ఈ రివ్యూలో చూద్దాం. ఫులేరా గ్రామంలో టెన్షన్ వాతావరణం ఉన్నప్పటికీ సచివ్ జీ అభిషేక్ త్రిపాఠీ(జితేంద్ర కుమార్) CAT పరీక్షలపై ఫోకస్ పెడతాడు. తుపాకి దాడి నుంచి తప్పించుకున్న ప్రధాన్ జీ బ్రిజ్ భూషణ్(రఘుబీర్ యాదవ్) ఎమ్మెల్యే చందు సింగ్(పంకజ్ ఝా) మరియు భూషణ్(దుర్గేష్ కుమార్)లపై కేసు నమోదు చేస్తాడు. ఈ క్రమంలో భూషణ్‌ను దూషించాడనే కేసును ఎదుర్కొంటాడు అభిషేక్. అయితే, అతడికి క్షమాపణలు చెప్పాలని అభిషేక్ ప్రయత్నించగా భూషణ్ తనకు ఓ పని చేయాలని డిమాండ్ చేస్తాడు. ఈ క్రమంలో భూషణ్, ప్రధాన్ జీ ల మధ్య ఎలాంటి పొలిటికల్ శత్రుత్వం ఏర్పడుతుంది..? ఇది ఎక్కడికి దారి తీస్తుంది..? అనేది మిగతా కథ. ఈ వెబ్ సిరీస్ తనదైన గ్రామీణ నేనథ్యంతోనే సాగుతుంది. జితేంద్ర కుమార్ మరోసారి చక్కటి పర్ఫార్మెన్స్ అందించాడు. వెబ్ సిరీస్‌ను ముందుకు తీసుకెళ్లడంలో అతని పాత్ర కీలకంగా ఉంటుంది. ఆయనకు తోడుగా గ్రామీణ నేపథ్యంలోని పలు పాత్రలు కూడా బాగా చేశారు. భూషణ్ పాత్రలో దుర్గేష్ కుమార్ ఈ సీజన్‌కు మరో బలంగా నిలిచాడు. గ్రామంలో సమస్యలు సృష్టించే పాత్రలో అతడి పర్ఫార్మెన్స్ ఆకట్టుకుంటుంది. అతడి భార్య క్రాంతి దేవి పాత్రలో సునీతా రజ్వర్ కూడా కీలక సన్నివేశాల్లో ఆకట్టుకుంటుంది. ప్రధాన్ జీ పాత్రలో రఘుబీర్ యాదవ్ మరోసారి మెరిశారు. మంజు దేవి పాత్రలో నీనా గుప్తా, ప్రహ్లాద్‌గా ఫైజల్ మాలిక్, బినోద్‌గా అశోక్ పాఠక్ చక్కటి నటనతో ఆకట్టుకున్నారు. వీరి మధ్య వచ్చే కెమిస్ట్రీ ఈ వెబ్ సిరీస్‌కు కలిసొచ్చింది. లడ్డూల కోసం జరిగే గొడవ, రాత్రి భోజనం దగ్గర మరొకటి, ఐటీ రైడ్, ఎమ్మెల్యే చేసే ఎటకారం వంటి సీన్స్ ఈ వెబ్ సిరీస్‌కు బలంగా నిలిచాయి. మంచి నేపథ్యం, ఆకట్టుకునే పాత్రలు ఉన్నప్పటికీ ఈ సీజన్ ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో తడబడింది. గత సీజన్ల తమదైన కామెడీతో ప్రేక్షకుల్లో మంచి మార్క్ వేసుకోగా.. ఈ సీజన్ మాత్రం రాజకీయం నేపథ్యంలో సాగడంతో అసలైన ఎమోషన్స్ మిస్ అయినట్లు అనిపిస్తుంది. కొన్ని ఎపిసోడ్స్ వరకు పర్వాలేదనిపించినా, ఆ తర్వాత కథ సాగదీతగా మారిపోతుంది. కథనం నెమ్మదించడంతో చాలా సీన్స్ సాగదీసినట్లుగా అనిపిస్తాయి. కథ కూడా ఎలాంటి ట్విస్టులు లేకుండా చప్పగా సాగుతుంది. కథలో డెప్త్ కూడా లేకపోవడం, కామెడీ కూడా పెద్దగా నవ్వించకపోవడంతో ప్రేక్షకులు బోర్ ఫీలవుతారు. రింకీ పాత్రలో సాన్విక నటన ఏమాత్రం ఇంప్రెస్ చేయదు. ఆమె పాత్రను కూడా చాలా తేలికగా తీసుకున్నట్లు అనిపిస్తుంది. ఆమె పాత్రను సరిగా రాసుకుని ఉంటే ఈ కథకు మరింత బలంగా మారేది. ఈ సీజన్‌ను ముగించిన తీరు కూడా ప్రేక్షకులను మెప్పించదు. వారిలో చాలా ప్రశ్నలు తలెత్తేలా ఈ సీజన్ ముగింపు ఉంటుంది. అక్షత్ విజయ్‌వర్గియ, దీపక్ కుమార్ మిశ్ర డైరెక్ట్ చేసిన ఈ సీజన్ పూర్తిస్థాయిలో అలరించలేకపోయింది. చందన్ కుమార్ రైటింగ్ కూడా గత సీజన్ల మాదిరిగా ఇంపాక్ట్ చూపించలేకపోయింది. స్కీన్ ప్లే లో కూడా ఎలాంటి కొత్తదనం కనిపించదు. అమితాభ సింగ్




సినిమాటోగ్రఫీ వర్క్ గత సీజన్లకు ఏమాత్రం తీసిపోకుండా ఆకట్టుకుంది. ఎడిటింగ్ వర్క్ మాత్రం ఇంకా బెటర్‌గా ఉండాల్సింది. చాలా సీన్స్ సాగదీతగా అనిపించడంతో వాటిని ట్రిమ్ చేసి ఉంటే బాగుండేది అనిపిస్తుంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కథకు తగ్గట్టుగా ఉన్నా, పూర్తి స్థాయిలో ఆకట్టుకోదు. నిర్మాణ విలువలు పర్వాలేదు. ఓవరాల్‌గా చూస్తే, పంచాయత్ సీజన్ 4 రాజకీయాల చుట్టూ తిరిగే కథతో రావడంతో ఎమోషనల్‌గా ఇది ప్రేక్షకులకు కనెక్ట్ కాలేదు. జితేంద్ర కుమార్, దుర్గేష్ కమార్ తమ నటనతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. స్లో పేస్, ఊహించినంత కామెడీ లేకపోవడం తదితర అంశాలు ఈ సీజన్‌కు డ్యామేజ్ చేశాయి. ఈ వెబ్ సిరీస్‌ను ఓపికగా తక్కువ అంచనాలతో చూస్తే బెటర్.

# అరడజను సినిమాలతో బిజీ

రితికా నాయక్.. ఢిల్లీకి చెందిన ఈ ముద్దుగుమ్మ మోడలింగ్ ద్వారా కెరీర్ ప్రారంభించింది. ఆతర్వాత నటిగా మారి ప్రేక్షకులను అలరిస్తుంది. ఆమె ప్రధానంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో పనిచేస్తుంది. రితిక నాయక్.. ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో జోరు మీద దూసుకుపోతున్న హీరోయిన్. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటించిన అశోకవనంలో అర్జున కళ్యాణం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే నటిగా మంచి మార్కులు కొట్టేసింది. కానీ ఈ సినిమా తర్వాత అమ్మడుకు అంతగా ఆఫర్స్ రాలేదు. నాని నటించిన హాయ్ నాన్న మూవీలో చిన్న పాత్రలో మెరిసింది. ఇక ఇప్పుడు ఈ బ్యూటీ క్రేజీ ఆఫర్స్ అందుకుంటుంది ఈ వయ్యారి భామ. మిరాయ్ చిత్రంలో మంచు మనోజ్ ప్రతినాయకుడిగా కనిపిస్తున్నాడు.





## గ్లోబల్ స్పోర్ట్ హబ్‌గా తెలంగాణ: శ్రీధర్ బాబు

తెలంగాణ ను 'గ్లోబల్ స్పోర్ట్ హబ్' గా మార్చాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 2036 ఒలింపిక్స్ లో తెలంగాణ బ్రాండ్ మెరవాలనే సంకల్పంతోనే కొత్త స్పోర్ట్ పాలసీకి శ్రీకారం చుట్టామన్నారు. మంగళవారం నిజాంపేట్ సమతానగర్ లో 'ఎస్ఎల్వీ ప్రో బ్యాడ్మింటన్ స్టేడియం'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఒకప్పుడు క్రికెట్ ను మాత్రమే క్రీడగా భావించేవారని, ఇప్పడా పరిస్థితి మారిందని, ఇతర క్రీడలకు ప్రాధాన్యం పెరిగిందని, తల్లిదండ్రుల ఆలోచన తీరులోనూ మార్పు వచ్చిందని వివరించారు. హైదరాబాద్ అంటే అందరికీ బిర్యానినే గుర్తుకొచ్చేదని, ఇప్పుడు బిర్యానీతో పాటు బ్యాడ్మింటన్ కూడా గుర్తుకొస్తుందన్నారు. గోపీచంద్, సైనా నెహ్వాల్, పీవీ సింధూ, చిరాగ్, సాత్విక్ లాంటి ప్రముఖ క్రీడాకారులు ఇక్కడి నుంచే ప్రయాణాన్ని ప్రారంభించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని ఎంతో మంది చిన్నారులు బ్యాడ్మింటన్ ను కెరీర్ గా ఎంచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిస్తున్నారని వెల్లడించారు. బ్యాడ్మింటన్ హబ్ గా హైదరాబాద్ మారడంలో గోపీచంద్ పాత్ర కీలకమని చెప్పారు. తమ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, 2026లో యంగ్ ఇండియా స్పోర్ట్ యూనివర్సిటీని ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నామని చెప్పారు. అన్ని గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేయబోతున్నామని, త్వరలో గచ్చిబౌలిలో బాలికల కోసం ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఫుట్ బాల్ అసోసియేషన్ అకాడమీని ప్రారంభించబోతున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల్లో స్పోర్ట్స్ స్కూల్స్ ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని, ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీసి వారిని ప్రోత్సహిస్తున్నామని వివరించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడిగా బ్యాడ్మింటన్ కేవలం హైదరాబాద్ కే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోకి తీసుకెళ్లేందుకు చేస్తున్న కృషిని వివరించారు. ఆసక్తి గల క్రీడలో చిన్నారులు రాణించేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### క్రిమినల్ లవ్.. ప్రేమ మోజులో పడి

# తల్లిని హతమార్చిన కూతురు



హైదరాబాద్‌లోని జీడిమెట్లలో దారుణం చోటుచేసుకుంది. కన్నకూతురే ప్రియుడితో కలిసి తల్లిని కిరాతకంగా హత్య చేసింది. తల్లి తమ ప్రేమకు అడ్డొస్తుందని భావించిన పదో తరగతి చదువుతున్న బాలిక, ప్రియుడు, అతని సోదరుడితో కలిసి ఆమెను దారుణంగా హతమార్చింది. వివరాల్లోకి వెళితే.. ఎన్ఎల్‌బీ నగర్‌కు చెందిన సట్ల అంజలి, తేజశ్రీ తల్లీ కూతుళ్లు. తేజశ్రీ ప్రస్తుతం పదో తరగతి చదువుతుంది. ఇటీవల ఇన్‌స్టాలో నల్గొండకు చెందిన పగిల్ల శివ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. అతర్వాత ఇద్దరూ ప్రేమించుకున్నారు. విషయం తెలుసుకున్న తల్లి అంజలి.. పదో తరగతిలోనే ప్రేమ ఏంటని తేజశ్రీని మందలించింది. బుద్ధిగా చదువుకోవాలని సూచించింది. దీంతో వారం రోజుల క్రితం శివతో కలిసి తేజశ్రీ ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బాలిక కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కిడ్నాప్ కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే మూడు రోజుల క్రితం పోలీసులు ఇద్దరిని పట్టుకొచ్చి, అమ్మాయికి కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు. అయితే, ఇంటికి తిరిగి వచ్చిన తేజశ్రీ.. తల్లి అడ్డు తొలగించుకోవాలని ప్రియుడు శివతో కలిసి ప్లాన్ చేసింది. దీంతో సోమవారం సాయంత్రం తన తమ్ముడు పగిల్ల యశ్వంత్‌తో కలిసి జీడిమెట్ల వచ్చిన శివ.. తేజశ్రీ ఇంటికి వెళ్లారు. అంజలి ఇంట్లో పూజ చేసుకుంటుండగా ఆమెపై వెనుక నుంచి దాడిచేసిన శివ.. బెడ్‌షీట్‌లో ఆమె ముఖాన్ని కప్పేశాడు. అనంతరం తేజశ్రీ తన తల్లి తలపై సుత్తితో కొట్టడంతో స్పృహ కోల్పోయింది. దీంతో శివ తమ్ముడు యశ్వంత్ ఆమె పీకను కత్తితో కోయడంతో అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, చనిపోయిన అంజలి ఎవరో కాదు.. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన చాకలి ఐలమ్మకు స్వయానా మునిమనవరాలు. తేజశ్రీ తల్లి అంజలి తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఫోక్ సింగర్‌గా ఉన్నారు. ఆమె స్వగ్రామం తొర్రూరు దగ్గర ఇనుగుర్తి. కూతురే తల్లిని ఇలా దారుణంగా చంపేయడంతో ఆ కళా బృందంలో సభ్యులంతా ఇప్పుడు షాక్‌లో ఉన్నారు. అయితే.. ఈ దారుణ ఘటనపై నిందితురాలు తేజ శ్రీ చెల్లి ప్రియ ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది. తను మీడియాతో మాట్లాడుతూ "ట్యూషన్ నుంచి వస్తున్న నన్ను మా అక్క గల్లీలోనే ఆపిందని, అమ్మ ఒక ఆంటీను తీసుకుని రమ్మందని చెప్పింది. కాగా, అప్పటికే కిచెన్‌లో అమ్మ స్పృహ లేకుండా పడి ఉందని పేర్కొంది. అమ్మను నేను చూసుకుంటా.. నువ్వు బయటకు వెళ్ళి మీ ఫ్రెండ్ ఎవరినైనా తీసుకుని రా.. గల్లీలో ఆంటీ వాళ్లకు ఎవరికీ చెప్పకు అని చెప్పిందని తెలిపింది. కాళ్లు చేతులు ఆడిస్తోంది అని చెప్పింది. మళ్ళీ శివ, యశ్వంత్ వచ్చి, సుత్తి తో అమ్మ తలపై కొట్టారని, చనిపోయింది అని నిర్ధారించుకున్న తర్వాత వెళ్ళిపోయారని వాపోయింది.

## వచ్చే నెల 4న హైదరాబాద్‌కు మల్లిఖార్జున ఖర్గే



ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వచ్చే నెల 4న హైదరాబాద్‌కు రానున్నారు. మంగళవారం జరిగిన పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే సభలో ఖర్గే పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ సభను విజయవంతం చేయడానికి పార్టీ నూతన కార్యవర్గం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. నూతన కార్యవర్గంతో కూడా ఖర్గే సమావేశమవుతారని ఆయన తెలిపారు.